

మమ్మేలు.. 'మాతంగి'

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర వైభవంగా సాగుతోంది. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - 8లో



సేద్యం.. సన్నద్ధం

ఖరీఫ్ సీజన్‌కు వాతావరణం అనుకూలించడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. - 8లో



శాస్త్రోక్తం.. ధ్వజారోహణం

శ్రీకాళహస్తి అనుబంధంగా ఊరందూరులో వెలసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో మొదలయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో క్యూలైన్ ఆక్టోపస్ బిల్డింగ్ వరకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 90,721 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 50,599 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.28 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉన్న వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

నేటి నుంచి న్యాయమూర్తులకు శిక్షణ

తిరుపతి లీగల్ : తిరుపతిలోని శ్వేత భవనంలో సోమవారం నుంచి 24వ తేదీ వరకు రాయలసీమ జిల్లాల్లోని 30 మంది న్యాయమూర్తులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తిరుపతి మండల న్యాయ సేవా సంస్థ సిబ్బంది తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల స్వాగతోపన్యాయం చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ జి.రామ్‌గోపాల్ హాజరు కానున్నట్లు వివరించారు. సీనియర్ ట్రైనర్లు సుదర్శన్ సుందర్ ప్రసాద్, సుబ్బన్న ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం

తిరుపతి అర్బన్ : మండే ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలను వరుణుడు కరుణించాడు. తొలకరితో పలకరించి ఉపశమనం కలిగించాడు. జిల్లాలో రెండు రోజులుగా పడుతున్న చిన్నపాటి వర్షాలతో వాతావరణం చల్లబడింది. ప్రధానంగా శనివారం జిల్లాలో 198.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చంద్రగిరిలో 76.6 మిల్లీమీటర్లు, ఎర్రావారిపాళెం -1.0, వెంకటగిరి- 52.2, రామచంద్రాపురం -19.4, రేణిగుంట-19.2, నాగలాపురం-4.2, వడమాలపేట-4.0, తొట్టంబేడు-3.6, డక్కిలి-3.4, తిరుపతి రూరల్- 2.8 , కేవీబీపురం -2.8, శ్రీకాళహస్తి-2.2, నారాయణవనం -2.0, బాలాయపల్లె-1.6, పుత్తూరు-1.2, సూళ్లూరుపేట- 1.0, బుచ్చినాయుడుకండ్రిగలో 0.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఆదివారం జిల్లాలో 63.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. పాకాలలో 25.2 మిల్లీమీటర్లు, చిన్నగొట్టిగల్లు-24.4, ఎర్రావారిపాళెం -10.8, చంద్రగిరిలో 2.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.



గరుడవాహనంపై ఊరేగుతూ కల్యాణ మండపానికి తరలివస్తున్న శ్రీమలయప్పస్వామి



● పరిణయం.. పరిపూర్ణం

తిరుమలలో పద్మావతీదేవి పరిణయోత్సవం ఆదివారంతో పరిపూర్ణమైంది. ముందుగా మలయప్పస్వామివారు గరుడునిపై కొలువుదీరి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం వేద పండితులు శాస్త్రోక్తంగా మంగళవాయిద్యాల నడుమ దేవదేవేరుల వివాహ ఘట్టం జరిపించారు. - తిరుమల



శ్రీవారి వాహన సేవలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తదితరులు

ఏం చేస్తున్నారు?

"దాడులు జరుగుతుంటే ఏం చేస్తున్నారు.. ముందస్తు సమాచారం ఉంది కదా ఏం చర్యలు తీసుకున్నారు.. విధ్వంసం సృష్టిస్తున్న వారిని ఎందుకు అడ్డుకోలేకపోయారు.. సర్పంచ్ ఇంటిని కాల్చివేస్తున్నా ఎందుకు ఆపలేకపోయారు.. పులివర్తి నానిపై దాడి జరిగిందా...కారుపై మాత్రమే జరిగిందా...నానిపై దాడి జరిగితే దెబ్బలు ఎక్కడ తగిలాయి.. ధర్నా సమయంలో ఆయన బాగానే ఉన్నట్టుగా కనిపించింది కదా...ఆస్పత్రిలో వైద్యులు ఎలాంటి నివేదిక ఇచ్చారు.. వెళ్లిపోతున్నవారిపై గన్‌మన్ ఎందుకు కాల్పులు జరపాల్సి వచ్చింది.. గాయపడిన యువకుడి పరిస్థితి ఎలా ఉంది...ఎలాంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు" అంటూ సిట్ బృందం పోలీసు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. అరాచక పర్వంలో నిజాలను నిగ్గు తేల్చేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించింది. బాధితులతో మాట్లాడి సమగ్రంగా వివరాలను సేకరించింది.



రామిరెడ్డిపల్లె వాసుల నుంచి వివరాలు సేకరిస్తున్న సిట్ అధికారులు

- పచ్చమూక అరాచకాలను పరిశీలించిన సిట్ బృందం
- క్షేత్రస్థాయిలో బాధితుల నుంచి వివరాలు ఆరా
- దాడుల తీరుతెన్నులపై సమగ్ర విచారణ
- తిరుపతి, చంద్రగిరిలో ఘటనాస్థలాల పరిశీలన
- విధ్వంసం జరుగుతుంటే ఏం చేస్తున్నారని పోలీసులపై ప్రశ్నల వర్షం

తిరుపతి రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియమించిన సిట్ బృందం ఆదివారం రంగంలోకి దిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ, ఎస్వీయూ పోలీస్‌స్టేషన్, చంద్రగిరి పోలీస్ స్టేషన్, చంద్రగిరి మండలంలోని కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లెలో సిట్ బృందం సభ్యులు డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ మురళీధర్ తదితరులు విచారణ చేపట్టారు. జరిగిన ఘటనలు, నమోదైన కేసుల వివరాలను స్థానిక పోలీసు అధికారుల నుంచి సేకరించారు. ఆయా కేసుల్లో బాధితుల నుంచి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసుకున్నారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గన్‌మన్ ఈశ్వర్‌ను ఘటనాస్థలానికి తీసుకెళ్లారు. మోహిత్‌రెడ్డి ఎందుకు కూచువారిపల్లెకు రావాల్సి వచ్చింది.. అక్కడ ఆయనను అడ్డుకుంది ఎవరు...మోహిత్‌కు వీసీల్‌కు మధ్య వాగ్వాదం ఎందుకు ఏర్పడింది...మోహిత్‌రెడ్డి కారును కాల్చిన పరిస్థితులు, తర్వాత గన్‌మన్ ఈశ్వర్‌ను, మోహిత్ కారు డ్రైవర్ హరీష్, మాజీ సైనికుడు వేణును కిడ్నాప్ చేసి కొటాలకు తీసుకెళ్లి హింసించింది ఎవరు...అంటూ పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ధర్నా సమయంలో నానికి గాయాలు లేవు కదా..!

పులివర్తి నాని కారుపై దాడి జరిగిన ప్రాంతాన్ని సిట్ బృందం పరిశీలించింది. నాని కారుపై మాత్రమే దాడి జరిగిందా...నానిపై కూడా జరిగిందా అని ఆరా తీసింది. ఆయనపై దాడి జరిగితే ధర్నా సమయంలో తీసిన వీడియోల్లో నాని బాగానే ఉన్నట్లు కనిపించింది కదా అని ప్రశ్నించింది .ధర్నా తర్వాత ఆయనకు ఎందుకు అస్వస్థత కలిగింది..వైద్యులు రిపోర్టు ఏమని ఇచ్చారు అంటూ వివరాలు సేకరించింది.

నాని గన్‌మన్ మెడకు కాల్పుల ఉచ్చు!

పద్మావతి మహిళా వర్సిటీలో కాల్పులు జరిపిన పులివర్తి నాని గన్‌మన్ ధరణి మెడకు ఉచ్చు బిగుస్తోంది. కారుపై దాడి తర్వాత వెనుతిరిగి వెళుతున్న వారిపై కాల్పులు జరపాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని సిట్ బృందం ప్రశ్నించింది. లాఠీచార్జి, ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఫైర్ ఎందుకు ఓపెన్ చేయాల్సి వచ్చింది.. ఇంతకీ కాల్పులు జరిపింది గన్‌మన్‌నేనా.. పులివర్తి నాని చేశాడా అనే వివరాలను ఆరా తీసింది. నాని అన్న కాల్పులు ఓపెన్ చేశాడనే ఆడియో, వీడియోలను పరిశీలించింది. గన్‌మన్ కాల్పుల్లో గాయపడిన యువకుడి పరిస్థితి ఎలా ఉంది..అతని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారా... అంటూ పోలీసు అధికారులను ప్రశ్నించింది.

ఆధారాలను అందించిన బాధితులు

కూచువారిపల్లెలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అడ్డుకోవడమే కాకుండా గన్‌మన్, డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి కొట్టడం, మోహిత్‌రెడ్డి కారును పెట్రోల్ పోసి కాల్చడం, మరో కారును ధ్వంసం చేయడం, రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని పెట్రోల్ పోసి కాల్చివేయడం, ఇంట్లో విలువైన వస్తువులను దోచుకున్న వైనం, పులివర్తి నాని స్వయంగా వేలాది మందితో వచ్చి గ్రామంలో అలజడి సృష్టించిన వీడియో, ఆడియో ఆధారాలను బాధితులు సిట్ బృందానికి అందించారు. పద్మావతి మహిళా వర్సిటీ వద్ద దాడి జరిగిన సమయంలో పులివర్తి నానికి ఎలాంటి గాయాలు కాలేదని, కేవలం ఆయన కారుపై మాత్రమే దాడి జరిగిందని, ఘటన తర్వాత నిక్షేపంగా ఉన్న నాని, సానుభూతి కోసమే ఆస్పత్రి డ్రామా ఆడారంటూ రామచంద్రాపురం జెడ్పీటీసీ సభ్యులు ఢిల్లీరాణి వీడియో ఆధారాలను అందించారు. కేవలం ఐదుగురు కారుపై దాడి చేస్తే 150 మందిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ పలువురు సి.రామాపురం మహిళలు సిట్ బృందానికి ఫిర్యాదు చేశారు.



మోహిత్‌రెడ్డి గన్‌మన్‌ను విచారిస్తున్న సిట్ అధికారులు

సర్పంచ్ ఇల్లు పరిశీలన

చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె పంచాయతీ కూచువారిపల్లెలో టీడీపీ మూకలు పెట్రోలు పోసి కాల్చివేసిన సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని సిట్ బృందం పరిశీలించింది. అసలు ఇంటిని కాల్చాల్సిన పరిస్థితులు ఎందుకు వచ్చాయి అని గ్రామస్తులను ఆరా తీసింది. పులివర్తి వీసీల్ ముందుగా గ్రామంలోకి వచ్చాడని, తర్వాత మోహిత్‌రెడ్డి వచ్చిన తర్వాత విషయం తెలుసుకుని పులివర్తి నాని వేలాది మంది రౌడీలతో చేరుకున్నాడని గ్రామస్తులు వెల్లడించారు. అనంతరం రామిరెడ్డిపల్లె పోలింగ్ బూత్ వద్ద జరిగిన ఘటనను సిట్ బృందం విచారించింది.



రాడ్‌తో దాడి చేసినా సీఐ ఎందుకు ఫిర్యాదు చేయలేదు?

కీలకమైన స్ట్రాంగ్ రూమ్ ఉన్న శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ముందు వేలాది మంది గుమికూడి ఆందోళన చేస్తుంటే వద్దని వారించిన తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్‌పై చిత్తూరు నుంచి వచ్చిన పులివర్తి నాని అనుచరులు రాడ్‌తో దాడి చేశారు. సీఐ తలపై బలంగా కొట్టడంతో రక్తగాయాలు అయ్యాయి. అడ్డుకున్న కానిస్టేబుల్‌ను సైతం గొంతుపట్టుకుని చంపేందుకు యత్నించారు. యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ సీఐపై కూడా దాడికి యత్నించారు. రక్తగాయాలు అయిన సీఐ కూడా ఎందుకు ఫిర్యాదు ఇవ్వలేదని సిట్ బృందం ఆరా తీసింది. నాని బెదిరింపులతోనే సీఐ ఫిర్యాదుపై వెనక్కితగ్గినట్లు సమాచారం.



సీఐపై దాడి చేస్తున్న టీడీపీ గూండాలు (ఫైల్)

ఆరంభం.. నృసింహుని సంబరం

పెంచనకోనలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణతో సంబరాలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ముందుగా ఉగ్రరూపుడైన నృసింహుడు నవ వరుడిగా ముస్తాబు చేసి గోనుపల్లె నుంచి ఊరేగింపుగా కోనకు వేంచేపు చేశారు. ఆదిలక్ష్మి.. చెంచులక్ష్మి సమేతంగా పల్లకిపై కొలువుదీరిన శ్రీవారు మంగళవాయిద్యాల నడుమ పెనుశిల క్షేత్రం చేరుకున్నారు. వేడుకగా నిర్వహించిన స్నపన తిరుమంజసేవలో సేదతీరారు. విశేష సంఖ్యలో భక్తులు దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

- ఊరేగింపుగా కోనకు చేరిన దేవదేవేరులు
- వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా అంకురార్పణ

రాపూరు: పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమైయ్యాయి. అందులో భాగంగా గోనుపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవితో కలసి స్వామివారు పెంచలకోనకు బయలుదేరారు. కొత్త అల్లుడు ఉభయనాంచారులతో కలసి కోనకు చేరుకోవడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమమైనట్లు ప్రధాన అర్చకులు పెంచలస్వామి,సీతారామయ్యస్వామి తెలిపారు.



విశేషాలంకరణలో స్వామి అమ్మవార్లు



పల్లకీలో కొలువుదీరి కోనకు వెళుతున్న దేవదేవేరులు



అంకురార్పణ పూజ నిర్వహిస్తున్న వేదపండితులు

అంకురార్పణతో శ్రీకారం

పెనుశిల లక్ష్మీనరసింహస్వామికివారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. స్వామివారి నందనవనంలోని పుట్టమట్టిని తీసుకొచ్చి అందులో నవధాన్యాలు కలిపి వేదమంత్రోచ్చరణాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ డీసీ సాగర్ బాబు, చెంగాళమ్మ ఆలయ ఏసీ వెంకటేశ్వర్లు, సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ మాల్యాద్రి పాల్గొన్నారు.

పెళ్లి కొడుకైన పెంచలస్వామి

హిరణ్యకశిపుని వధానంతరం ఉగ్రరూపుడైన నృసింహ స్వామివారు వెలుగొండలలో సంచరిస్తుండగా చెంచురాజు (గిరిజనరాజు) కుమార్తె చెంచులక్ష్మి చెలిమితో శాంతించి ఆమెను వివాహమాడినట్లు పురాణాల్లో పేర్కొన్నారు. అప్పటి నుంచి గోనుపల్లె గ్రామంలోని ఉత్సవ విగ్రహాలకే పెంచలకోనలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏటా గోనుపల్లెలో పెంచలనరసింహస్వామి పెళ్లి కొడుకుగా ముస్తాబై కోనకు తరలివెళతారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం గోనుపల్లె నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా గిరిజనకాలనీకి తీసుకొచ్చారు. గిరిజనులు సంప్రదాయబద్ధంగా ఇంటి అల్లుడు, కుమార్తెకు (స్వామి, అమ్మవార్లకు) ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, సారపప్పు, పెద మల్లెలు, బందారు ఆకులతో భాసికం, ఎల్లగడ్డలు, తండేడుతో తాళిబొట్టు, స్వామివారికి కట్నంగా ఇచ్చే అరినార మొలతాడును సాంగ్యంగా చెల్లించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు పల్లకిలో ఊరేగుతూ పెంచలకోనకు చేరుకున్నారు.

వేడుకగా స్నపన తిరుమంజనం

కోనలోని క్రేన్ మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల ఉత్సవర్లకు పాలు, తేనె, పెరుగు, చందనం, వివిధ పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లతో అభిషేకం చేశారు.



విద్యుద్దీపకాంతులీనుతున్న పెనుశిల క్షేత్రం



శ్రీవారి సమర్పణకు అడవి గడ్డలు తీసుకువస్తున్న గిరిజనులు

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు


తిరుపతి క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు కల్పించనున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆదివారం తిరుపతి జిల్లా ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఎస్పీ కార్యాలయం సిబ్బంది గౌరవ వందనం చేసి, పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఇటీవల జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని తిరిగి ప్రజా విశ్వాసం చూరగొనేలా సమష్టిగా పనిచేస్తామని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించేలా ప్రతి ఒక్కరు కూడా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు ముగిశాయని, లెక్కింపు మాత్రమే మిగిలి ఉందన్నారు. ఇప్పటికే ప్రజలు ఇచ్చిన తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తం చేయబడిందని వెల్లడించారు. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో పని చేయటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఇలాంటి పుణ్యక్షేత్రంలో గొడవలు జరగడం చాలా దురదృష్టకరమని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేస్తామన్నారు. కౌంటింగ్ సందర్భంగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తామని, ఇబ్బంది కలిగించే వారిని నిర్బంధిస్తామని తెలిపారు. అనంతరం ఆయనకు ఏఎస్పీలు, డీఎస్పీలు శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

నారాయణవనం : నారాయణవనంలో వెలసిన పద్మావతీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేయనున్నారు. 9 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం రోజూ ఉదయం, రాత్రి వివిద వాహనాలపై స్వామి వారు ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని అలయంలో చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మాడ వీధుల్లో దశావతార మూర్తుల కటౌట్లను ఏర్పాటు చేశారు. ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్య మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ శనివారం గరుడసేవ, 27వ తేదీ సోమవారం ఉదయం రథోత్సవం, సాయంత్రం 7 గంటలకు జరిగే ఆర్జిత కల్యాణోత్సవంలో రూ 1,000 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చునని తెలిపారు. 29వ తేదీ బుధవారం పద్మసరస్సులో చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహనంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని వివరించారు.



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

కంటైనర్‌ను ఢీకొన్న లారీ

– డ్రైవర్‌కు గాయాలు



ఘటనాస్థలంలో కంటైనర్, లారీ

శ్రీకాళహస్తి(తొట్టంబేడు): తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో రాచగున్నేరి వద్ద కంటైనర్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కార్ల లోడ్‌తో వస్తున్న కంటైనర్‌ను తిరుపతి వైపు వస్తున్న ఖాళీ లారీ ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి ఢీకొంది. దీంతో వైఎస్సార్ జిల్లా నందలూరుకు చెందిన లారీ డ్రైవర్ కృష్ణయ్య(45) కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు శ్రమించి కృష్ణయ్యను బయటకు తీశారు. 108లో చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

ఇదెక్కడి 144 సెక్షన్..?

– వారపు సంతలో కిక్కిరిసిన జనం



వారపు సంతకు వచ్చిన జనం

చంద్రగిరి : నియోజకవర్గంలో పోలింగ్ రోజు, తర్వాత గొడవలు చెలరేగిన నేపథ్యంలో అధికారులు 144 సెక్షన్ విధించారు. నలుగురుకు మించి జనం గుడికూడదని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పంచాయతీ అధికారులు సైతం వారపు సంతను రద్దు చేస్తున్నట్లు మూడు రోజుల క్రితమే ప్రకటించారు. అయితే ఆదివారం వారపు సంత మామూలుగా సాగడంతో పెద్ద సంఖ్యలో జనం రోడ్డుపైకి చేరుకున్నారు. దీంతో చంద్రగిరి టవర్‌క్లాక్ సెంటర్ జనంతో నిండిపోయింది. 144 సెక్షన్‌ను అమలు చేయాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

శోభాయాత్రగా తరలివస్తున్న ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష తదితరులు



తిరునగరి వీధుల్లో వేషధారుల ప్రదర్శన



మమ్మేలు.. మాతంగి

- వైభవంగా తాతయ్యగుంట గంగమ్మజాతర
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం
- పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్న మహిళలు
- ఇంటింటా పూజలందుకున్న మాతంగి వేషధారులు

తిరుపతి కల్చరల్ : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా ఐదో రోజు ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా కైకాల కులస్తులు మాతంగి వేషం ధరించి నగరంలో భక్తుల ఇంట పూజలు అందుకున్నారు. మాతంగి అమ్మవారిని భక్తులు తమ ఇంటికి ఆహ్వానించి పూజలు చేసి హారతులు సమర్పించారు. జాతర మొక్కుబడిలో భాగంగా వందలాది మంది వివిధ వేషధారణలతో నగరంలో సందడి చేశారు. గంగమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారి పాదాల చెంత ప్రణమిల్లి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దసంఖ్యలో మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో గంగమ్మ ఆలయం కిక్కిరిసింది. అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు విశేష పూజలు నిర్వహించి మాతంగి అలంకరణలో కొలువుదీర్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అభిషేకాలతో శాంతి

అమ్మవారి జాతర చాటు నుంచి మాతంగి వేషం రోజు వరకు విభిన్నరీతుల్లో వేషధారణలతో అలసిన గంగమ్మతల్లిని శాంతింపజేసేందుకు సోమవారం అర్ధరాత్రి 12.15 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. క్షీరం, పంచామృతం, నారికేళ జలం, పసుపు నీటితోపాటు ఇతర మంగళద్రవ్యాలతో అమ్మవారిని అభిషేకించారు. అనంతరం మూలమూర్తికి విశేష పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.



గంగమ్మ దర్శనానికి తరలివచ్చిన అశేష భక్తులు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో అమ్మవారు



ముస్లింలకు గంధం పూస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్

నేడు సున్నపు కుండల వేషాలు

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా ఆరో రోజు సోమవారం ఇద్దరు కైకాల కులస్తులు సున్నపు కుండల వేషాలు ధరిస్తారు. పెద్దగంగమ్మ, చిన్నగంగమ్మలకు ప్రతీకలుగా వీరు భక్తుల ఇంట పూజలు అందుకుంటారు. అలాగే మొక్కుబడిలో భాగంగా భక్తులు చప్పరాలు ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు.

సర్వభూపాల వాహనంపై సర్వాంతర్యామి



కల్పవృక్ష వాహనంపై అభయమిస్తున్న గోవిందరాజస్వామి.

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజుఆదివారం రాత్రి శ్రీవారు పాండురంగస్వామి అలంకరణలో సర్వభూపాల వాహనంపై ఊరేగారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు కళా బృంద ప్రదర్శనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ వేడుకగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి కల్పవృక్షవాహన సేవను కనులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిపించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో విశేషంగా అభిషేకం చేశారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్ఏ అండ్‌సీఏఓ బాలాజీ, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, సూపరింటెండెంట్ మోహనరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు పాల్గొన్నారు.



సర్వభూపాల వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు





వాహన సేవలో కళా ప్రదర్శనలు

సేద్యం.. సన్నద్ధం

- ఖరీఫ్‌కు అనుకూలిస్తున్న వాతావరణం
- 65,250 హెక్టార్లలో సాగుకు అవకాశం
- దుక్కులకు సిద్ధమవుతున్న రైతాంగం
- విత్తనాలు.. ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం



పొలం దుక్కి దున్నుతున్న దృశ్యం

తిరుపతి అర్బన్ : వరుణుడి కరుణతో పుడమి పులకించింది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 65,250 హెక్టార్లలో పంటల సాగు చేపట్టనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పలు ప్రాంతాల్లో రైతులు పొలాలను దుక్కిదున్నుతున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం కూడా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసింది. అన్నదాతలు సైతం విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాలకు(ఆర్బీకే) వెళ్లి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని ఆర్బీకేల్లో మొదలైంది. ముందుస్తుగానే ప్రభుత్వం సైతం విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసింది. 50శాతం సబ్సిడీతో జీలగలు, జనుములు, పిలిపెసర, 40శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. మరోవైపు ఎరువుల సరఫరాపై కూడా అధికారులు దృష్టి పెట్టారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు

పంటల సాగు చేసే సమయంలో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఖరీఫ్ సాగు ముందే ఏటా అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా కింద రూ.5,500 చొప్పున పెట్టుబడి సాయం జమ చేస్తోంది. అయితే ఈసారి ఎన్నికల నేపథ్యంలో వీటిని జమ చేస్తారా, లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పథకాల సొమ్ములను జమ కాకుండా ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు.. ఇప్పుడైనా రైతు భరోసా నిధులు విడుదల చేయనిస్తారా, లేదా? అన్నది వేచి చూస్తున్నారు.

అనుక్షణం.. అప్రమత్తం



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి అర్బన్ : కౌంటింగ్ పూర్తయ్యే వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పోలీసులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి ఆదివారం పద్మావతి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ముందు సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం ఆయన బ్యారికేడింగ్, సీసీ కెమెరాల పర్యవేక్షణ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ పెంచల కిషోర్, ఏఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర, శ్రీనివాస రావు, చంద్రగిరి ఆర్ఓ నిషాంత్ రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని చెన్నకేశవస్వామి ఆలయం



ధ్వజపటం ఎగురవేస్తున్న దృశ్యం



శాస్త్రోక్తం.. ధ్వజారోహణం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టి సర్వదేవతలకు ఆహ్వానం పలికారు. ఈ నెల 28వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిపించనున్నారు. ఈ సందర్భంగా ఉభయదేవేరీ సమేతంగా శ్రీవారు హంసవాహనంపై ఊరేగారు. పెద్దసంఖ్యలో భక్తులు దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి



ప్రత్యేక అలంకారంలో దేవదేవేరులు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు